

ఎంఎల్‌సి ఎన్నికల నిబంధనలు తెలుసుకోవాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

భీమవరం :రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎంఎల్‌సి ఎన్నికల నియమ నిబంధనల సంపూర్ణంగా తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి జిల్లాలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 430 మంది ఓటర్లు ఉన్నారని జిల్లాలో భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 201 మంది ఓటర్లు, నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 229 ఓట్లు మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం అందరూ నడుచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, డిఆర్ఓ కె.కృష్ణవేణి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ముసలం..!



అధికారపక్షంలో అసంతృప్త జ్వాలలు
ఆది నుంచి కష్టపడిన నేతలకు అధినాయకత్వం ఝలక్
జయమంగళ, కరాటంలకు ఎంఎల్‌సి పదవుల
ప్రచారంపై జిల్లా నేతల్లో ఆగ్రహం
పార్టీని దెబ్బతీస్తున్నారంటూ వైసిపి శ్రేణుల విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్‌సి పదవుల వ్యవహారం వైసిపిలో ముసలం రేపుతోంది. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడినోళ్లను పక్కనపెట్టి వేరే పార్టీల నేతలకు పదవులు కట్టబెట్టే ఆలోచనపై జిల్లాలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ఆవిర్భావ సమయంలో అధినాయకుడు చెప్పిన మాటలకు, ప్రస్తుత పరిణామాలకు పొంతన లేకపోవడం పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మడమ తిప్పం.. మాట తప్పం అని చెప్పిన నాయకుడు ప్రస్తుతం సొంత పార్టీలో కష్టపడిన నాయకులను పక్కనపెట్టి వేరే పార్టీలో నాయకులను పిలిచి మరీ పదవులు కట్టబెట్టడం ఏమిటనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ నెల 16న స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. జిల్లాలో రెండు స్థానిక సంస్థల ఎంఎల్‌సి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో అత్యధికం వైసిపికి చెందిన వారే. దీంతో రెండు ఎంఎల్‌సి పదవులు వైసిపికే దక్కనున్నాయి. దీంతో పార్టీలో ఆది నుంచి కష్టపడుతున్న నాయకులంతా ఎంఎల్‌సి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఒకటి బిసి, రెండో పదవి జనరల్‌కు ఇస్తారనే ప్రచారం సాగింది. ఇక్కడి వరకూ బాగానే ఉంది. ఎంఎల్‌సి పదవులపై వైసిపి అధిష్టానం వ్యవహరిస్తున్న తీరు ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో కైకలూరులో టిడిపి అభ్యర్థిగా బరిలోకి దిగి ఓటమి పాలైన టిడిపి నాయకుడు జయమంగళ వెంకటరమణకు ఎంఎల్‌సి పదవి ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. సిఎం జగన్‌ను కలిశానని, ఎంఎల్‌సి పదవిపై భరోసా ఇచ్చారని జయమంగళనే చెబుతున్నారు. జయమంగళకు భద్రత పెంచడం దీనికి బలం చేకూరుస్తోంది. వైసిపిలోనూ వడ్డి సామాజిక తరగతికి చెందిన నేతలన్నారు. వీరు కూడా ఎంఎల్‌సి పదవి ఆశిస్తున్నారు. హఠాత్తుగా టిడిపిలో ఉన్న నేతను పిలిచి పదవి కట్టబెట్టడాన్ని వైసిపి నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. రాత్రీ పగలు పార్టీ కోసం కష్టపడటం ఎందుకని వారంతా ప్రశ్నిస్తున్నారు. జగన్ పార్టీ పెట్టిన సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను వదిలి వైసిపితో అడుగులు వేసిన నేతలకు ఇప్పటికీ గుర్తింపు లేకుండా పోయింది. టిడిపి ప్రభుత్వ హయాంలోనూ వీరంతా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని పార్టీ కోసం కష్టపడ్డారు. అలాంటి నాయకులను వైసిపి అధిష్టానం ఏమాత్రం పట్టించుకోకపోవడం అందరినీ తీవ్రంగా వేధిస్తోంది. దీంతో ఎంఎల్‌సి పదవి ఆశిస్తున్న నేతలంతా పార్టీ అగ్రనేతలను కలిసి గట్టిగానే దీనిపై మాట్లాడినట్లు సమాచారం. కొంతమంది నేతలైతే కళ్లనీళ్లు పెట్టుకున్నట్లు కూడా తెలుస్తోంది. జయమంగళ చేరికతో లాభం సంగతి అటుంచి పెరుగుతున్న అసంతృప్తితో వైసిపికి తీవ్రం నష్టం తప్పదనే అభిప్రాయం వైసిపి నేతల్లో వ్యక్తమవుతోంది.

రెండో పదవికి పరిశీలనలో కరాటం రాంబాబు?

జిల్లాలోని రెండు ఎంఎల్‌సి పదవుల్లో ఒకటి టిడిపి నుంచి రానున్న బిసి నేత జయమంగళ వెంకటరమణకు ఇవ్వనున్నట్లు ఇప్పటికే కొంత స్పష్టత వచ్చింది. రెండో ఎంఎల్‌సి పదవి మెట్ట ప్రాంతంలో ఒకప్పుడు కాంగ్రెస్‌లో కీలకంగా వ్యవహరించి డిసిసిబి ఛైర్మన్‌గా పని చేసిన కాపునేత కరాటం రాంబాబుకు ఇవ్వనున్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం కరాటం రాంబాబు కాంగ్రెస్‌లో కూడా చురుగ్గా లేరు. దాదాపు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అయినప్పటికీ కాపు కోటాలో కరాటం రాంబాబుకు ఎంఎల్‌సి పదవి ఇవ్వాలని వైసిపి అధిష్టానం చూస్తున్నట్లు సమాచారం. దీనిపై ఇప్పటికే కొంత చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కరాటం రాంబాబుకు ఎంఎల్‌సి పదవి ఇవ్వడంపై స్థానిక వైసిపి నేతలు అభ్యంతరం చెబుతున్నట్లు తెలిసింది. రెండో పదవి కరాటం రాంబాబుకు ఇస్తే పార్టీలో ఎంఎల్‌సి పదవి ఆశిస్తున్న నాయకులకు మొండిచెయ్యి చూపించినట్లే. ఏదేమైనా ఎంఎల్‌సి పదవుల వ్యవహారం వైసిపిలో పెద్దఎత్తున ముసలం రేపే పరిస్థితి కన్పిస్తోంది. కాపు కోటాలో గుణ్ణం నాగబాబుకు ఎంఎల్‌సి పదవి ఇవ్వాలని జిల్లాలోని ముఖ్యనేతలు అధినాయకత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీనిపైనా వైసిపి నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కీలక సమయంలో పార్టీని వీడి అధికారంలోకి వచ్చాక మళ్లీ తిరిగొచ్చిన వారికి ఏవిధంగా ఎంఎల్‌సి పదవి కట్టబెడతారనే ప్రశ్నలు ఆ పార్టీ శ్రేణుల నుంచే వెల్లువెత్తుతుండటం గమనార్హం. ఏదేమైనా అభ్యర్థిత్వాలు ఖరారయ్యాక ఎటువంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచి చూడాలి.



సదస్సులో మాట్లాడుతున్న ఏపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

లక్షలాది మందితో కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీ
ఎపి కౌలురైతు సంఘం
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు
కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం
సిఐటియు, వ్యవసాయ కార్మిక, రైతు, కౌలురైతు సంఘాల జిల్లా సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం

కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం, కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ, లక్షలాది మందితో జరుగుతున్న కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక ప్యాడీ అండ్ రైస్‌మర్చంట్స్ హాల్లో మంగళవారం సిఐటియు, ఎపి వ్యవసాయ కార్మిక, ఎపి రైతు, కౌలురైతుల సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రధాన వక్త హరిబాబు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లు దోచుకుంటున్నారన్నారు. ప్రజలపై ఎక్కువ పన్నులు మోపడంతో మధ్యతరగతి, సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నవరత్నాలుగా పేరొందిన ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తున్నారన్నారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారని, వ్యవసాయ కూలీలకు రక్షణగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని అన్నారు. ఈ దేశ సంపద అంతా అదాని, అంబానీల చేతుల్లోకి వెళ్లిపోతుందని తెలిపారు. రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి రూ.30 లక్షల కోట్లు కోత పెట్టారని, దీనివల్ల 15 వేల కోట్ల పని దినాలు తగ్గిపోయాయని అన్నారు. కేంద్రంలో బిజెపి తానా అంటే రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన తందాన అంటున్నాయని విమర్శించారు. బిజెపికి అనుకూలంగా ఈ మూడు పార్టీలు వ్యవహరించడం తప్ప ప్రజలు, రైతులు, ఉద్యోగ కార్మికుల సమస్యలు వారికి పట్టవని విమర్శించారు. ఈ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్యతతో మోడీని గద్దె దింపేవరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సదస్సులో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహామూర్తి, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమరాజు, సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, హసీనా, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

ఢిల్లీ కోసాలు కదలాలి..



జెఎన్‌వి.గోపాలన్, సిఐటియు జిల్లా అధ్యక్షులు

అధికారం చేపట్టి ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న బిజెపి 75 ఏళ్ల స్వాతంత్రంలో ఏ ప్రభుత్వమూ అవలంబించని ప్రజావ్యతిరేక విధానాలను ఈ కాలంలో అవలంబించింది. అనేకసార్లు అనేక సమస్యలపై జనం సమ్మెలు, ధర్నాలు, ఆందోళనలు చేశారు. అయితే దేశాన్ని బిజెపి నుంచి కాపాడుకోవాలనే ఉద్దేశంతో తలపెట్టిన చలో ఢిల్లీ పిలుపు మేరకు ప్రతిఒక్కరూ తరలి రావాలి. లక్షలాది మంది ఐక్యతా ర్యాలీతో ఢిల్లీ కోసాలు కదిలించాలి.

విస్తృత ప్రచారానికి సన్నద్ధం ..



కె.రాజారామ్మోహన్‌రాయ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహించబోయే చలో ఢిల్లీ, ఐక్యతా ర్యాలీ విజయవంతానికి జిల్లాలో విస్తృత ప్రచారానికి సన్నద్ధం కావాలి. నాలుగు సంఘాలతో సమన్వయం చేసుకుని ప్రచారానికి సంబంధించి ప్రణాళిక రూపొందించాం. 20 మండలాలు, ఆరు పట్టణాల్లో నాలుగు సంఘాల ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. మార్చి 1 నుంచి 10వ తేదీ వరకు ఇంటింటా ప్రచారం, గ్రూప్ సమావేశాలు, 20 నుంచి 25 వరకు దళాలుగా ఏర్పడి కరపత్రాలు, పోస్టర్ల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 27 నుంచి 30వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా కళారూపాలతో జీపు జాతా, 26న ప్రధాని కేంద్రాలను కలుపుతూ మోటార్ సైకిల్ ర్యాలీ ద్వారా విస్తత ప్రచారం చేయడానికి సిద్ధంగా ఉండాలి.

సమస్యలతో రైతులు సతమతం..



ఆకుల హరేరాం, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

జిల్లాలో వ్యవసాయ రంగానికి నీటి లభ్యత అంతంతమాత్రంగానే ఉంది. ఈ ఏడాది 600 క్యూసెక్కుల నీటిని తగ్గించారు. శివారు ప్రాంతాల పొలాలకు నీరందడం లేదు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు, నీటిలభ్యత, ఎరువులు పురుగు మందుల సబ్సిడీ కుదింపు, పెరిగిన యాంత్రీకరణ తదితర సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి.

మోడీకి గుణపాఠం చెప్పాలి..



మామిడిశెట్టి రామాంజనేయులు, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

మూడు నల్ల చట్టాల రద్దుకు ఢిల్లీలో రైతాంగం చేసిన పోరాటం చారిత్రాత్మకం. తప్పని పరిస్థితుల్లో మూడు చట్టాలను మోడీ రద్దు చేసి రైతులకు క్షమాపణ చెప్పారు. అయితే వాటిని దొడ్డిదారిన అమలు చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. దీన్ని తిప్పికొట్టేందుకు చేపట్టిన చలో ఢిల్లీ, ఐక్యతా ర్యాలీకి పెద్దసంఖ్యలో తరలివచ్చి మోడీకి గుణపాఠం చెప్పాలి.

చలో ఢిల్లీ చరిత్రలో నిలవాలి..



బల్ల చిన్న వీరభద్రం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఎవరికీ ఎటువంటి ఉపయోగమూ లేదు. వివిధ రంగాలపై కోతలు విధించారు. ఇది చాలదన్నట్లు వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించే ఆలోచన చేస్తున్నారు. రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, సిఐటియు ఆధ్వర్యంలో చేపడుతున్న చలో ఢిల్లీ, ఐక్యతా ర్యాలీ ఎవరూ ఊహించని విధంగా చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించాలి. దీనికి అన్ని సంఘాలు సమాయత్తం కావాలి.

వైద్యులను నియమించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల వైద్యులనూ నియమించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ నరసాపురం ఏరియా ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరత వల్ల తీర ప్రాంతంలో ప్రజలకు వైద్యం సరిగా అందట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్లో 24 రకాల వైద్యులు అవసరం ఉండగా కేవలం 12 రకాల వైద్యులు మాత్రమే అందుబాటులో ఉన్నారని తెలిపారు. వైద్యుల కొరత కారణంగా పేదలు వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రయివేటు హాస్పటల్స్‌పై ఆధారపడాల్సి వస్తుందన్నారు. రెండు నెలల క్రితం ప్రారంభించిన వంద పడకల ఆసుపత్రిలో ఇంతవరకు డాక్టర్లను నియమించకపోవడం, ల్యాబ్, ఇసిజి వంటి అధునాతన వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకురాకపోవడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి అట్టహాసంగా ప్రారంభించిన ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. నరసాపురం ఏరియా హాస్పిటల్‌లో అన్ని రకాల వైద్యులను నియమించి అధునాతన వైద్య పరికరాలతో తీర ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పొన్నాడ రాము, బూడిద జోగేశ్వరరావు, పొగాకు నారాయణరావు, నోముల కొండ మండల కార్యదర్శి బొక్కా శ్రీనివాస్, నేతలు జల్లి రామ్మోహన్‌రావు, వాసా రామలింగం, పొన్నాడ మల్లేష్ పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న నేతలు

ఇఎస్‌ఐ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

స్థానిక ఇఎస్‌ఐ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, 30 పడకల ఆసుపత్రి నిర్మాణం వెంటనే ప్రారంభించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక ఇఎస్‌ఐ ఆసుపత్రి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆసుపత్రిలో ఖాళీలన్నీ భర్తీ చేయాలని, అన్ని రకాల పరీక్షలు చేసి మందులు ఇవ్వాలని, మహిళా వైద్యురాలిని నియమించాలని, ఇఎస్‌ఐ పాత సమయాన్ని అమలు చేయాలని, 30 పడకల ఆసుపత్రి నిర్మించాలని నినదించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సత్యకు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు అంటే పాలకులకు ఎంత ప్రేమో తణుకు ఇఎస్‌ఐ ఆసుపత్రిని చూస్తే అర్థమవుతుందన్నారు. జిల్లాలో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందినప్పటికి నేటికీ 30 పడకల ఆసుపత్రి లేకపోవడం శోచనీయమన్నారు. 30 వేల మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు తణుకులో ఉన్నప్పటికీ ఇఎస్‌ఐ సదుపాయం లేనివారు వేలల్లో ఉన్నారన్నారు. ఆసుపత్రికి వచ్చే వారికి తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాల్లేవని విమర్శించారు. కరోనాకు ముందు ఉన్న ఇఎస్‌ఐ ప్రారంభ సమయం పునరుద్ధరించాలన్నారు. కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రతాప్ హెచ్చరించారు. ఈ ధర్నాలో సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు కామన మునిస్వామి, నేతలు టి.రామకృష్ణ, ఆర్.శ్రీనివాస్, బి.ధనరాజు, హరికృష్ణ, మణికంఠ, ధర్మయ్య, సత్యనారాయణ, గోపాలకృష్ణ, నాగేశ్వరరావు, కూరెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సత్యకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నేతలు

ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలి

సిబ్బందికి జెసి మురళీ దిశానిర్దేశం

ప్రజాశక్తి - భీమవరం

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేలా సిబ్బంది పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మురళీ సూచించారు. దుర్గాపురం-1, 2, కొవ్వాడ అన్నవరం, శివరావుపేట-1 సచివాలయాల్లో ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందిన లబ్ధిదారుల జాబితాను పథకాల వారీ నోటీసు బోర్డులో ఉంచాలని, అనర్హుల జాబితాలను కూడా నోటీసు బోర్డులో ఉంచాలని ఆదేశించారు. ప్రతిరోజూ సచివాలయ పరిధిలో స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించాలన్నారు. వాటిని అదేరోజు సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, వార్డు వాలంటీర్లు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. శాఖల వారీగా సచివాలయ ఉద్యోగులను వర్క్ ప్లాన్ అడిగి తెలుసుకున్నారు. జెసి వెంట డిప్యూటీ తహశీల్దార్ గ్రంధి పవన్, మున్సిపల్ సహాయ కమిషనర్ బి.జ్యోతిలక్ష్మి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

జెసికి వినతి

ప్రజాశక్తి - భీమవరం

విఆర్‌ఎలను ఫేస్ అటెండెన్స్ యాప్ నుంచి మినహాయించాలని, తీసేసిన డిఎను పునరుద్ధరించాలని, కనీస వేతనం రూ.26 వేలు అందించి నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ విఆర్‌ఎలు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ మురళీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు, అధ్యక్షులు బి.గణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని జిల్లా కలెక్టరేట్లు వద్ద శాంతియుతంగా ఆందోళన జరుగుతున్నా జిల్లా అధికారులు మాత్రం ఎన్నికల కోడ్ పేరుతో అనుమతులు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ అధికారులు కింద పనిచేసే తమలాంటి వారికే బాధలు చెప్పుకునే అవకాశం ఇవ్వకపోతే ఇంకెవరికి ఇస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. జెసిని కలిసి వినతిపత్రం అందించేందుకు అనుమతివ్వడం సంతోషకరమన్నారు. విఆర్‌ఎలను కట్టుబానిసలుగా చూస్తున్నారని, విపరీతమైన పని ఒత్తిడికి గురి చేస్తున్నారని, ఇది హేయమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో వివిధ మండలాలకు చెందిన విఆర్‌ఎలు ఉన్నారు.



జెసికి వినతిపత్రం అందిస్తున్న విఆర్‌ఎలు

త్రిపుర ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

త్రిపుర రాష్ట్రంలో ఈ నెల 16న జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సజావుగా, ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కోరారు. స్థానిక ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ హాలులో త్రిపుర సంఘీభావ సభ మంగళవారం నిర్వహించారు. ఈ సంఘీభావ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించగా ముఖ్యవక్త సీతారాం మాట్లాడారు. త్రిపురలో గతంలో జరిగిన ఎన్నికల్లో గెలుపొంది, అధికారంలోకి వచ్చినప్పటి నుండి నేటి వరకూ రాష్ట్రంలో భీతావాహం సృష్టించిందన్నారు. మళ్లీ ఇప్పుడు రాష్ట్రంలో అదే పరిస్థితి సృష్టించి అధికారం చేజిక్కించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. అమలు సాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన బిజెపి రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిందన్నారు. అంతకుముందు కమ్యూనిస్టుల పాలనలో ఉన్న త్రిపుర ఇటువంటి దుర్మార్గపు పాలనను ఎన్నడూ చూడలేదన్నారు. సిపిఎం పాలనలో అతి చిన్న రాష్ట్రమైనా అక్షరాస్యతలో దేశంలోనే ముందు నిలిచిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నూటికి నూరు శాతం అమలు చేసిన రాష్ట్రంగా త్రిపుర ఉందన్నారు. బిజెపి అధికారంలోకి రాగానే సిపిఎం నాయకులు, కార్యకర్తలు, పార్టీ, ప్రజాసంఘాల కార్యాలయాలు, మహిళలపై చేసిన దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలకు లెక్కే లేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో బిజెపి బెదిరింపు ధోరణిలో ఇతర రాష్ట్రాల నుంచి పోలీసులను, అల్లరి మూకలను, మోటార్ సైకిల్ గ్యాంగులను దింపి ఎన్నికల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే పనిలో ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో వామపక్షాలు, ప్రధానంగా సిపిఎం అధికారంలోకి వచ్చే సానుకూలత కన్పిస్తున్న తరుణంలో ప్రధాని, హోం శాఖా మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి అడ్డదారుల్లో అరాచకం సృష్టించి మళ్లీ బిజెపిని తీసుకొచ్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. ఇటువంటి దుర్మార్గపు బిజెపి పాలన నుంచి త్రిపుర విముక్తి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. త్రిపురలో సాగుతున్న ఈ ఘోరకలిని దేశ ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. వామపక్షవాదులు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు అందరూ త్రిపుర ప్రజలకు అండగా ఉండాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ బిజెపి పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా చాలా చిన్న రాష్ట్రమైన త్రిపురలో భయానక వాతావరణం సృష్టిస్తుందన్నారు. ప్రశాంతంగా ఉండే ఈశాన్య రాష్ట్రాల్లో ఒకటైన త్రిపురలో మారణకాండ నెలకొల్పిన ఘనత బిజెపిదేనని అన్నారు. త్వరలో జరగబోయే రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్, ఎం.రామాంజనేయులు, సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహామూర్తి, ఆకుల హరేరాం, పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మంతెన సీతారాం

న్యాయం చేయండి

పంచాయతీ వద్ద పురుగుల మందు డబ్బాతో వలంటీర్ బైఠాయింపు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇల్లు కట్టుకోనివ్వకుండా సర్పంచి కొడుకు అడ్డుకుంటున్నాడంటూ ఓడూరు వాలంటీర్ తన తల్లితో పంచాయతీ వద్ద బైఠాయించి పురుగుల మందు తాగేందుకు యత్నించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా బాధితురాలు శాంతికుమారి విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. ఓడూరు మూడో వార్డులో వాలంటీర్‌గా పనిచేస్తున్నానని, కొద్దిరోజుల క్రితం ఇల్లు కట్టుకోవడానికి కావాల్సిన మెటీరియల్ తెప్పించానని తెలిపింది. అయితే సర్పంచి బుర్రా రవికుమార్ కొడుకు ఇల్లు కట్టుకోకుండా అడ్డుకుంటున్నాడని ఆవేదన చెందుతోంది. ఈ విషయాన్ని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకెళ్లినా తనకు న్యాయం జరగలేదని వాపోతోంది. సర్పంచి కొడుకు వల్ల తనకు ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న సిఐ నాగేశ్వరరావు, ఎస్‌ఐ బి.సురేంద్ర కుమార్, సర్పంచి బుర్రా రవికుమార్ చేరుకుని ఇరువురితో చర్చించి న్యాయం చేస్తామని శాంతికుమారికి హామీ ఇచ్చారు. సమస్య ఏదైనా ఉంటే పంచాయతీ అధికారుల దృష్టికి గాని సర్పంచి దృష్టికి గాని తీసుకురావాలని తెలిపారు. లేని పక్షంలో తమను సంప్రదించాలని తెలిపారు. మెటీరియల్ తెచ్చుకోవడానికి ఎటువంటి అభ్యంతరం లేదని గ్రామ పెద్దలు సద్ది చెప్పారు.



పంచాయతీ కార్యాలయం ముందు పురుగు మందు సీసాతో బైఠాయించిన వాలంటీర్ శాంతకుమారి

దొడ్డనపూడిలో లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి - కాళ్ల

రైతులను ప్రోత్సహించడానికి లేగదూడల ప్రదర్శన నిర్వహిస్తున్నామని జిల్లా పశుసంవర్ధక జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ తెలిపారు. దొడ్డనపూడి గ్రామంలో కాళ్ల పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రబాబు ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన, పెంపకంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల నుంచి ఆదాయాన్ని ఎలా పెంచుకోవచ్చు, వాటి పెంపకాన్ని ఏ విధంగా నిర్వహించాలో దానిపై అవగాహన కల్పించేందుకు లేగదూడల ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిడి జేసు రత్నం, డిడి హాస్పిటల్, ఏడి జనార్దనరావు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - కాళ్ల

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ పి.రమామహేశ్వరి అన్నారు. ఏలూరుపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్, కేన్సర్ వంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రాథమిక, హైస్కూల్, అంగన్వాడీ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమామహేశ్వరి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి పరంజ్యోతి, ఎఎన్ఎమ్‌లు బి.మ్యారిగోల్డ్, లోకేశ్వరి, ఎంఎల్‌హెచ్ పిటి.భూలక్ష్మి పాల్గొన్నారు.

'జగనాసుర రక్తచరిత్ర' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వివేకానంద రెడ్డి హత్య జరిగి నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ దోషులను అరెస్ట్ చేయలేదని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వివేకానంద హత్యపై జగనాసుర రక్తచరిత్ర పుస్తకాన్ని సీతారామలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ చెల్లి సునీత జగన్ ప్రభుత్వంపై నమ్మకం లేదని తెలంగాణ హైకోర్టుకు కేసును బదిలీ చేయించిందని తెలిపారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ వివేక హత్యానంతరం జరిగిన సంఘటనలను వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకే జగనాసుర రక్తచరిత్ర పుస్తకం ద్వారా రాష్ట్రంలో ప్రజలకు వివరించనున్నామన్నారు. ఈ సమావేశంలో భీమవరం మండల అధ్యక్ష కార్యదర్శులు రేపు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, ఐటిడిపి మండల అధ్యక్షుడు బొడ్డు మోహన్ పాల్గొన్నారు.

ఉండి : అంబేద్కర్ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని ఎంఎల్ఎ మంతెన రామరాజు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద మంగళవారం జగనాసుర రక్త చరిత్ర పుస్తకం, పోస్టర్‌ను ఎంఎల్ఎ రామరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య చాలా దారుణమన్నారు. త్వరలో నిందితులు దొరుకుతారని, కచ్చితంగా శిక్ష పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షులు కాగిత వెంకట సత్యనారాయణ (బుజ్జి), నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ పాల్గొన్నారు.

పందులకు టీకాలు

ప్రజాశక్తి - పోడూరు

పెనుమదంలో పందులకు స్వైన్ ఫీవర్ రాకుండా పశువైద్య అధికారి డాక్టర్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో మంగవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ క్లాసికల్ స్వైన్ ఫీవర్ కారణంగా పందులు బలహీన పడి నీరసంగా ఉంటూ అకస్మాత్తుగా చనిపోయే అవకాశం ఉందన్నారు. ఉచిత టీకా కార్యక్రమాన్ని పందుల పెంపకందారులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎల్ఒ బి.శ్రీనివాస్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరంలో కార్ల షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టాటా మోటార్స్ జాస్పర్ ఇండస్ట్రీస్ వారి నూతన కారు షోరూంను మంగళవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ప్రారంభించారు. ఆటో మొబైల్ రంగంలో విశిష్ట స్థానం ప్రాముఖ్యతను జాస్పర్ ఇండస్ట్రీస్ సాధించుకుందన్నారు. రాష్ట్రంలో బెంజ్ కంపెనీ అంటే తెలియని వారు ఉండరని, టాటా కంపెనీ సరసమైన ధరలతో నాణ్యమైన భద్రత కలిగిన వాహనాలను వినియోగదారులకు అందించడం అభినందనీయమని మంత్రి అన్నారు. ఎంఎల్ఎలు మాట్లాడారు. భీమవరంలో ఆధునిక వసతులతో నూతన షోరూంను ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపి గోకరాజు గంగరాజు, గాదిరాజు సుబ్బరాజు, ఇ.సూర్యారావు, గోకరాజు రామరాజు, సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళి

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పుల్వామా అమర జవాన్లకు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముచ్చర్ల వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కాశ్మీర్ పుల్వామాలో ఉగ్రమూకలు దాడిచేసి 40 మంది వీర జవాన్లను పొట్టన పెట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చల్లా వెంకట ఆదినారాయణ, కోశాధికారి మాధుం నారాయణ, ఆర్.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పోడూరు : పుల్వామా ఉగ్రవాద దాడిలో అమరవీరులకు గుమ్మలూరు మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్య కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లవ్ పీపుల్ ఫౌండేషన్ ఛైర్మన్ ఉన్నమట్ల ప్రేమ్ కుమార్ వీరజవానుల చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్య కుమార్ మాట్లాడారు.

ప్రభుత్వ విధానాలతో తిరోగమనం

ప్రజాశక్తి - నరసాపురం

వైసిపి ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం తిరోగమనంలో పోతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు విమర్శించారు. పసలదీవిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు రామరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వాతాడి ఉమామహేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు కొట్టు వీర వెంకట సత్యనారాయణ, గుత్తుల వర్ధయ్య, కొట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందులషాపుల్లో తనిఖీలు

కాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, పురుగుమందుల షాపుల్లో తణుకు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.వి.రమేష్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కాళ్ల, కాళ్లకూరు, ఏలూరుపాడు, జువ్వలపాలెం, బొండాడ గ్రామాల్లో ఎరువులు, పురుగుమందుల షాపులు తనిఖీ చేశారు. ఆ షాపుల్లో బిల్ బుక్స్, రిజిస్టర్స్, ఈపాస్ మిషన్స్, స్టాకును పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జయవానీకి పాల్గొన్నారు.

ఆకివీడు: ప్రస్తుతం వరి వ్యవసాయ సీజన్ వచ్చిన కారణంగా ఎరువులు, పురుగు మందులను వ్యాపారులు అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉందని తణుకు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎవి రమేష్ అన్నారు. రైతులు పూర్తి అప్రమత్తంగా ధరలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. ఎరువులు, పురుగు మందుల సీజన్ సందర్భంగా ఎరువుల దుకాణాలను తనిఖీ కోసం ప్రత్యేక అధికారిగా ఇక్కడికి వచ్చారు. మంగళవారం ఆయన పట్టణంలోని పలు ఎరువుల, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు.

పది పరీక్షలకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

10వ తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని ఎంఇఒ ఆర్.వెంకటరమణ అన్నారు. మంగళవారం తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలకు సంబంధించి ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం జరిగింది. అనంతరం ఎపి ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఆర్ వెంకటరమణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోట, ఎస్ఎవి ప్రసాద్, పైడిపాటి ప్రధానోపాధ్యాయులు నేలపాటి వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట రామేశ్వరస్వామి సత్రం నుంచి శుక్రవారం సంత మార్కెట్ వరకూ రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట రామేశ్వరస్వామి సత్రం నుంచి శుక్రవారం సంత మార్కెట్‌కు వెళ్లే రహదారి ఇటీవల గ్రామ సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు గ్రామ పంచాయతీ స్పెషల్ గ్రేడ్-3 నిధులతో వేగవంతం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆ రహదారిని ఎంఎల్ఎ పరిశీలించి మాట్లాడారు. శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఆచంట కచేరీ సెంటర్ నుంచి మార్కెట్ వరకూ ఆర్అండ్‌బి రహదారి నిత్యం ట్రాఫిక్ నేపథ్యంలో వాహనదారులు అనేక ఇబ్బందులకు పడుతుండేవారన్నారు. ఆచంట రామేశ్వరస్వామి సత్రం నుంచి శుక్రవారం మార్కెట్ వరకూ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తొలగిపోతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ, దేవస్థానం ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, మండే శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎఇ రమేష్, ఎలక్ట్రికల్ ఎఇ ఆనందరాజు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌ను ప్రజలు నమ్మరు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మరోసారి జగన్ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. ఎఎంసి ఆవరణలో మంగళవారం మండల కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం ఎంఎల్ఎ గ్రంథి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. మూడున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకూ సమన్యాయం చేయడంతో పాటుగా అర్హులైన ప్రతి కుటుంబానికీ నవరత్నాలను అందజేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ప్రజలు 2019 ఎన్నికల్లో కేవలం 23 సీట్లకే చంద్రబాబును పరిమితం చేశారన్నారు. గతేడాది రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించే సమయంలో కొంత మేర జాప్యం జరగడానికి చంద్రబాబే కారణమన్నారు. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు మంచి సేవలందించే విధంగా కృషి చేయాలన్నారు. భీమవరం నియోజకవర్గంలో దాదాపుగా 15 వేల మందికి పైగానే పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయగా, విస్సాకోడేరు లేఔట్‌లో సుమారుగా రెండు వేల గృహాలు బేస్మెంట్ లెవెల్ పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

విస్సాకోడేరులో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళా

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరు ఫోర్‌నంబర్‌పేటలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళాను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు యోగాపై శిక్షణ ఇచ్చారు. మత, శిశు సంరక్షణ సేవలు, మధుమేహం, రక్త పోటు పరీక్షలు, చికిత్స, కేన్సర్ పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు వ్యా, ఆరోగ్య గుర్తింపు కార్డు జారీ, ఉచిత మందుల పంపిణీ, పౌష్టిక ఆహార సలహాలు, సూచనలు వంటివి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళా ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్ శ్రీనివాస్, నాగమునమ్మ, లలిత, హెల్త్ అసిస్టెంట్ గోపాలకృష్ణ, హేమ, భవాని పాల్గొన్నారు.

సిద్ధాంతం శ్మశానవాటిక అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతం శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని కోరుతూ మంగళవారం సిద్ధాంతం, దొంగరావిపాలెంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడారు. ఘటాలదిబ్బ, సీతమ్మకాలనీ, సబ్ స్టేషన్ కాలనీ, చింతలపాలెం, తానీష్‌పాలెం, కొబ్బరితోట, పెద్దపేట, బూరుగులంక, నక్కవారిపాలెం, చెరువుపేట, అరుంధతీపేట, లంకపేట, సాలిపేట, గరగాలమ్మ దిబ్బ, రాజీవ్‌నగర్‌కాలనీ, ఎన్‌టిఆర్ కాలనీ, దొంగరావుపాలెం ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన శ్మశానవాటిక అభివృద్ధి పనులను తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యపై స్పందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు

పరిశ్రమల్లో ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆదిశేషు

ప్రజాశక్తి - భీమవరం

పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల పట్ల కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు అన్నారు. భీమవరం ఇండస్ట్రియల్ పార్క్‌లోని సంతోషిమాత ఫీడ్ ఫ్యాక్టరీ, స్వామి ఫీడ్స్, సీసలిలోనీ జయలక్ష్మి సీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కుమార్ ఆగ్రో ఆయిల్స్ పరిశ్రమలను ఎన్‌టిఆర్ బృందం సందర్శించింది. ఈ మేరకు రసాయనిక పరిశ్రమలో ప్రమాదాలను ఎలా నివారించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం సంభవించిన అనంతరం చేపట్టాల్సిన చర్యలపై పూర్తి అవగాహన కార్యక్రమాన్ని ఎన్‌డిఆర్ఎఫ్ బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ జిల్లాలో మూడు అతి ప్రమాదకరమైన పరిశ్రమలు ఉన్నాయని, వాటిలో తణుకులోని ఆంధ్ర షుగర్స్, జయలక్ష్మి ఫెర్టిలైజర్స్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి జెడ్ఎం.కృష్ణ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, ఎన్‌టిఆర్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు



శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అధికారి సంధ్య

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహాశివరాత్రి సందర్భంగా రామేశ్వరస్వామిని దర్శించుకునే యాత్రికుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎండోమెంట్ సింగరాయపాలెం చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్.సంధ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం నత్తారామేశ్వరంలో రామేశ్వరస్వామి దేవస్థానంలో రెవెన్యూ, ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ ఈ ఏడాది యాత్రికుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. దేవస్థానం పరిసర ప్రాంతంలో మాంసం విక్రయాలు లేకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. రథోత్సవంలో అల్లర్లు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెలగల ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీశైలపు నాగేంద్ర కుమార్, దేవస్థానం కార్య నిర్వహణ అధికారి వై.శ్రీధర్, సిఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు: శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లోని శివాలయాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొగల్తూరులోని ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాలకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సాగు నీరందించడంలో విఫలం

ప్రజాశక్తి - ఉండి

ప్రస్తుత రబీ సీజన్లో వరి రైతులకు సాగునీరందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. వేసవికాలం ప్రారంభం కాకముందే గోదావరిలో నీటి లభ్యత తగ్గిపోయిందని, దీంతో వంతుల వారీగా కాలువలను విడుదల చేస్తుండగా ఆక్వా రైతులు వారి చెరువుల్లోకి నీటిని ఇంజన్ల ద్వారా తోడుకుంటున్నారని, దీని కారణంగా శివారు ప్రాంత రైతులకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి వరి రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

19న జిల్లాస్థాయి ఏకపాత్రాభినయ పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్లో జిల్లాస్థాయి బాల బాలికలకు ఏకపాత్రాభినయ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు కత్తుల రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సలేషన్ బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసపత్రాలు అందజేస్తామని తెలిపారు. పోటీల అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు.

ఒరిజినల్ లింకు దస్తావేజులు పోయినవి

కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, బాపులపాడు గ్రామం, గుడివాడ రోడ్డు, డోర్ నెం.9-10రు కాపురస్తురాలు నరికిమిల్లి సత్యనారాయణగారి భార్య నరికిమిల్లి నాగలక్ష్మి కుమారి వయస్సు 54 సం॥లు పై అడ్రస్‌లో నివాసముంటున్న నేను ది.15-2-2017వ తేదీన దబ్బాడ వెంకటమ్మ గారి వలన పెదపాడు మండలం, ఏపూరు గ్రామ రీ.స. 242-4 రు దాఖలా చ.గ. 193.6 ల నివేశన స్థలము, అందుగల డోర్ నెం.9-11 ఆర్.సి.సి. భవనము వగైరాల సహా కొనుగోలు చేసుకొని నా పేరున శ్రీ వట్లూరు స.రి.లో ద.నెం. 273/2017 రుగా రిజిష్ట్రీ పొంది అట్టి ఆస్తి నేటి వరకు నా స్వాధీన హక్కుభుక్తములలో వుండియున్నది. నా దస్తావేజుకు లింకు దస్తావేజు నెం. 3349/2010 రును, అట్టి దస్తావేజుకు లింకు దస్తావేజు నెం.7957/2006రు మరియు, సదరు నెం. 7857/2006రుకు లింకు దస్తావేజు 836రుగా నాకు అందజేయటం జరిగియున్నది. అట్టి 7957/2006, 836రుగా గల లింకు దస్తావేజులను ది. 11-02-2023వ తేదీన ఒక కవరులో పెట్టుకొని జిరాక్స్ తీయించుకొనుటకు ఏలూరురోడ్డులో వున్న జిరాక్స్ సాపు వద్దకు వెళ్ళి చూసుకొనగా కవర్‌లో పెట్టుకొన్న దస్తావేజు ఎక్కడో జారిపడిపోయినది. నేను వచ్చిన మార్గములో ఎంత వెదికినా, అక్కడున్నవారిని అడిగినా నా ఒరిజినల్ లింకు దస్తావేజు కనిపించలేదు. సదరు ఒరిజినల్ రెండు లింకు దస్తావేజులు నెం. 7957/2006, 836 ఎవరికైనా దొరికిన యెడల క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరని కోరుతున్నాను.

ఇట్లు
నరికిమిల్లి నాగలక్ష్మి కుమారి,
భర్త : నరికిమిల్లి సత్యనారాయణ, డోర్ నెం.9-10రు
బాపులపాడు గ్రామం, గుడివాడ రోడ్డు,
బాపులపాడు మండలం, కృష్ణాజిల్లా,

వ్యకాస అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలి

పశ్చిమబెంగాల్ తరలివెళ్లిన ఉమ్మడి జిల్లా నేతలు

ప్రజాశక్తి - భీమవరం



తరలి వెళ్తున్న ప్రతినిధులు

వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని ఉమ్మడి జిల్లాల నేతలు పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం 10వ అఖిల భారత మహాసభలు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హౌరా పట్టణం శరత్ సడాన్‌లో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకూ జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మహాసభలకు ఉమ్మడి జిల్లా నేతలు ప్రతినిధులుగా హాజరుకానున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ఉమ్మడి జిల్లా నేతలు పశ్చిమబెంగాల్ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలో గడిచిన మూడేళ్లలో సంఘం చేసిన కృషిపై సమీక్షించి వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాడేందుకు భవిష్యత్ కార్యాచరణ తయారు చేసుకుని నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహాసభ సందర్భంగా ఈనెల 17న జరిగే భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ హాజరు కానున్నారని తెలిపారు. పశ్చిమబెంగాల్ తరలివెళ్లిన వారిలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.రవి, పి.రామకృష్ణ, ముత్యాలమ్మ, ఎం.జీవరత్నం, టి.సత్యనారాయణ ఉన్నారు.

యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

ఆర్‌డిఒ దాసి రాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాసి రాజు

ఈనెల 18వ తేదీన జరగే మహాశివరాత్రి ఉత్సవాలకు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్‌డిఒ దాసి రాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్‌డిఒ కార్యాలయంలో దేవదాయ శాఖ, మున్సిపల్, పోలీస్‌లతో పాటు పలు శాఖల అధికారులతో మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ ముఖ్యంగా ఉమా సోమేశ్వర జనార్దన స్వామి ఆలయానికి యాత్రికల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ ఆలయంలో ఈనెల 16వ తేదీ నుండి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, దానికి అనుగుణంగా స్వామివారి దర్శనార్థం, బందోబస్తు, క్యూలైన్లు యాత్రలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే భీమేశ్వరస్వామి ఆలయంలో కూడా యాత్రికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్, వన్ టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్, సోమేశ్వర దేవస్థానం ఇఒ అరుణ్ కుమార్, భీమేశ్వర దేవస్థానం ఇఒ ఎం.శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పాలకొల్లులో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం 24వ వార్డులో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటింటికి తిరిగి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజా సమస్యలు పట్టించు కోవడం లేదని, ప్రతిపక్షంగా ఈ ప్రభుత్వం పై ఎన్ని ఉద్యమాలు చేసిన దున్నపోతుపై వర్షం పడిన చందం గా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, దుగ్గిన రాము, సలాది బాబులు, అడ్డాల మల్లి, కోళ్ల సీతయ్య ,బండెల భాస్కర్ రావు, కొప్పర్తి మురళి, రావెళ్ల నాగయ్య ,గంధం రాజేష్, మందాడి అవినాష్ అల్లం తాతాజీ ,దుగ్గిన రవి, శ్రీరామ్మూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు..

ఇచ్చిన హామీలు అమలు

ప్రభుత్వ చీఫ్ విప్

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరు ప్రసాద్‌రాజు అన్నారు. మొగల్తూరులోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో గృహసారధుల అవగాహన సదస్సు ను మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, జడ్పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు నాయకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు

E.P.No. 64/2021
AACFNo. 143/2019

Between:
కపిల్ చిట్స్ (కోస్తా) ప్రై.లిమిటెడ్ ఏలూరు బ్రాంచ్ -DHR
మరియు
కొయ్యగర్ల సజ్జనరాజు వగైరాలు -JDRs

6th JDR అడ్రస్ : పెర్లి ఇమ్మానియేలు, తండ్రి సముద్రాలు కెహెచ్ హెల్పర్, ఎంప్లాయి నెం. 244ఐజి100081, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఎస్‌సి రైల్వే నిడదవోలు, ఆర్/ఓ క్వ్యా.నెం. 50/6ఎ రైల్వే క్వార్టర్స్, ఏలూరు రైల్వే స్టేషన్ వద్ద, ఏలూరు

పై గ్రంధంలో పై పేర్కొన్న 6వ JDR కోర్టు వారి నోటీసు తీసుకొనుటలో జాప్యం చేస్తున్నందున, కోర్టు వారి ఆదేశానుసారం ఈ ప్రకటన జారీ చేయడమైనది.

పై పేర్కొన్న 6వ JDR పై కోర్టువారి ఎదుట ది. 22-2-2023వ తేదిన ఉదయం 10-30 గంటలకు హాజరై తగురీతిలో సంజాయిషీ యిచ్చుకోవలెను లేదా అడ్వకేట్ ద్వారా నైనా హాజరు కావచ్చు, అట్లు హాజరు కాని ఎడల మీ పరోక్షంలో కోర్టువారు విచారణ గాలించి తగురీతిలో ఆర్డర్స్ పాస్ చేయుదురని యిందుమూలంగా తెలియపర్చడమైనది.

ఇట్లు,
ఎన్.వి. సత్యనారాయణ (ఎన్‌వియస్)
అడ్వకేట్
ఏలూరు, సెల్ నెం. 9440376655
ఏలూరు,
2-2-2023

సైక్లింగ్ ద్వారా ఆరోగ్యం

పాలకోడేరు: ప్రతిరోజూ సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని పిహెచ్‌సి వైద్యాధికారి రంగనాయుడు అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఆయా గ్రామాల్లో ఎంఎల్‌హెచ్‌పి ఆధ్వర్యంలో సైకిల్‌తో వ్యాయామం కార్యక్రమాన్ని మంగళవారం గొరగనమూడి, విస్సాకోడేరు, పాలకోడేరు, కుముదువల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ బిజీ లైఫ్‌ను సాగిస్తున్నారన్నారు. ఈ తరుణంలో సైక్లింగ్ చేయడం ద్వారా బీపీ, షుగర్ తగ్గించుకోవడమే కాకుండా ఒత్తిడిని సైతం జయించవచ్చున్నారు. అదేవిధంగా సైక్లింగ్‌తో గుండె జబ్బులు, కేన్సర్ సైతం నయం చేసుకోవచ్చున్నారు. ప్రతిరోజూ గంట అయినా సైకిల్ తొక్కాలని విద్యార్థులకు, గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సత్యనారాయణ, హెచ్ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు గుడివాడ
ఓ.యస్. నెం. 351/2016

బిట్వీన్:
శాయిన రామ్మోహనరావు మరియు 5 ఇతరులు - వాదులు
మరియు
1. పల్నాటి రాజరావు మరియు 17 ఇతరులు
17) దోస శ్రీనివాసరావు, తండ్రి దామోదరరావు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, రిటైర్డ్ సి.ఐ.గారి ఇల్లు, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.
18). దోస శాంతరామ్, తండ్రి దామోదరరావు, పంచాయతీ ఆఫీసు ప్రక్కన, వల్లంపర్రు గ్రామం, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. -ప్రతివాదులు

పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు ప్రతివాది 17 మరియు 18 వార్లకు నోటీసులు పేపరు ప్రకటన ద్వారా అమలు చేయుటకు శ్రీకోర్టు వారు ఉత్తర్వులను జారీ చేసి ప్రతివాది 17 మరియు 18 వార్లు హాజరగుటకు దావాని ది. 01-03-2023వ తేదికి వాయిదా వేసియున్నారు. సదరు తేదిన ప్రతివాది 17 మరియు 18 వార్లు స్వయంగా గాని, వారి అడ్వకేట్ గాని ద్వారా గాని ఉదయం 10.30 ని॥లకు పైకోర్టులో పై తేదిన హాజరు కావలెను. అట్లు హాజరు కాని ఎడల పై నెంబరు గల దావాని ప్రతివాది 17 మరియు 18 వార్ల పరోక్షమందు వారికి వ్యతిరేకంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారం)

గుడివాడ
తేది 13-02-2023

ఎస్. వి.పాండురంగారావు
అడ్వకేట్, గుడివాడ

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కైకలూరు, ఏలూరు జిల్లా
C.C. No. 25/2019

Between:
కొప్పోజు వరలక్ష్మి ***...Complainant***
మరియు
మేకా వాసు ***...Accured***

కంప్లయింట్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల కేసులో ముద్దాయి అయిన మేకా వాసు, S/o. సత్యనారాయణ, డోరు నెం. 8-120/1, న్యూ అశోక్ నగర్, గౌరవరం, 3rd Town, 5th Road, శనివారపుపేట, ఏలూరు, ఏలూరు జిల్లా వారికి పై కోర్టు వారి ఎదుట **ది. 22-2-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తెలియపరచు కొనవచ్చును. లేనిఎడల కేసు తమ పరోక్షముగా విచారణ జరుగును అని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

ముంతా సతీష్, అడ్వకేట్
ఏలూరు, ఏలూరు జిల్లా
సెల్: 95333 62629

PUBLIC NOTICE
In the Court of the Additional Senior Civil Judge, Eluru
I.A. No. 193/2022
in
H.M.O.P. No. 151/2021

Between:
Smt. Pasam @ Sanku Krishnaveni ***...Petitioner/ Respondent***
AND
Pasam Veerendra Kumar ***...Respondent/ Petitioner***

Whereas, the petitioner filed petition to set aside the ex-parte order dated 05-01-2022 passed against the petitioner, whereas, the Hon'ble Court was pleased to order notice to you. Therefore, you are informed to appear before the Hon'ble Court **on 20-02-2023 at 10.30 A.M** and state your objections if any, else the matter will be decided according to Law.

PYDI VENKATA RAJU
Advocate, Eluru
Cell: 98851 99811

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు
I.A. 882/2022, O.S. 477/2014

బిట్వీన్:
మెట్టపల్లి సాంబమూర్తి ***-పిటీషనర్/వాది***
మరియు
కంతా రామారావు, వగయిరా ***-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు***

పిటీషనరు దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల పిటీషన్‌లో 13వ రెస్పాండెంటు అయిన బవిరిశెట్టి రవికుమార్, S/o. నాగేశ్వరరావు, డోరు నెం. 9-328, సాయిబాబా గుడి దగ్గర, చింతలపూడి, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది. 21-2-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు పిటీషన్ ఏకపక్షముగా తీర్మానము చేయుదురని యిందుమూలముగా తెలియచేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
అడ్వకేట్స్, శ్రీరామ నివాస్
ఏలూరు అశోక్‌నగర్, ఏలూరు
ది.14-2-23 ఏలూరు జిల్లా